www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 జులై 2024
5
ఏలూరు



ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి: సిపిఎం

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సిపిఎం నేతలు ఉపాధి హామీ ఎపిఒ టి.రోజ్‌లీలాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని 16 గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించి ఐదు వారాల సొమ్ము రావాల్సి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు తెలిపారు. బకాయిల చెల్లింపులో అలసత్వంతోపాటు ఉపాధి పనులు చూపడం, కూలి తదితర అంశాల్లో వ్యత్యాసాలు తగవని సూచించారు. దిగువ స్థాయి అధికారుల తీరు మారకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పేరిచర్ల నాగేశ్వరరావు, నక్క రంగారావు, పి.ఆంజనేయులు, లక్ష్మణరెడ్డి, సాయిబాబా, కంచర్ల శ్రీను, కంచర్ల రాము, పి.నాగేశ్వరరావు, కంచర్ల దుర్గారావు, మానికల కాసులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనులు ముమ్మరం..!

రెండు జిల్లాల్లో 4.30 లక్షల ఎకరాల్లో వరిసాగు
ఇప్పటి వరకూ 60 శాతం నారుమడులు పూర్తి
మెట్టప్రాంతంలో బోర్ల కింద 8 వేల ఎకరాల్లో నాట్లు
ఆగస్టు మొదటివారం వరకూ నాట్లు సాగే పరిస్థితి
కౌలుకార్డుల జారీలో వీడని నిర్లక్ష్యం
పెట్టుబడి సొమ్ము కోసం అన్నదాత అవస్థలు


ఉంగుటూరు మండలం వెలమల్లిలో బోర్ల కింద వేసిన ఖరీఫ్ నాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు పడుతుండటంతో రైతులు నారుమడులు, నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో 'పశ్చిమ'లో 2.11 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 2.19 లక్షల ఎకరాలు మొత్తం రెండు జిల్లాల్లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. జూన్ ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ నారుమడులు ముందుకు మాత్రం సాగలేదు. దీంతో జూన్ నెల పూర్తయినా ఇప్పటికీ 60 శాతం మాత్రమే నారుమడులు పూర్తయ్యాయి. గడచిన కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు నారుమడులు ముమ్మరంగా వేస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో నారుమడులు పూర్తయ్యే పరిస్థితి కన్పిస్తోంది. మెట్ట ప్రాంతంలో బోర్ల కింద సాగుచేసే రైతులు నారుమడులు ముందుగా వేయడంతో తాడేపల్లిగూడెం, పెదపాడు, ఉంగుటూరు వంటి మండలాల్లో ఇప్పటికే ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్టలో నాట్లు కొనసాగుతుండగా డెల్టాలో ఇంకా నారుమడులు పూర్తికాని పరిస్థితి ఉంది. ప్రస్తుతం నారుమడులు సాగుతున్న పరిస్థితి చూస్తే ఆగస్టు మొదటి వారం వరకూ ఖరీఫ్ నాట్లు కొనసాగే అవకాశం కన్పిస్తోంది. ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభమైనప్పటికీ పెట్టుబడులకు సొమ్ము లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రబీ ధాన్యానికి సంబంధించిన సొమ్ము ఇప్పటికీ రైతులకు అందలేదు. ఎప్పటికి ఇస్తారో స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ధాన్యం సొమ్ము పశ్చిమలో రూ.900 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.245 కోట్లు వరకూ రైతులకు అందాల్సి ఉంది. ధాన్యం సొమ్ము అందకపోవడంతో రబీలో పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులను రైతులు తీర్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేకపోవడంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం డబ్బు కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

కౌలుకార్డుల జారీ పూర్తయ్యేదెప్పుడో..!

కౌలురైతులకు బ్యాంకు రుణాలు అందని ద్రాక్షగా మారాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభమై నాట్లు ప్రారంభమైనా ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ ఏడాది పశ్చిమలో లక్షా ఆరు వేలు, ఏలూరు జిల్లాలో 76 వేలు మంది రైతులకు కౌలుకార్డులు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ పట్టుమని రెండు వేల మందికి కూడా కౌలుకార్డుల జారీప్రక్రియ సాగలేదు. కౌలుకార్డులు అందజేత ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కౌలుకార్డు లేకపోతే బ్యాంకుల నుంచి పంటరుణాలు అందే పరిస్థితి ఉండదు. దీంతో కౌలురైతులు పెట్టుబడుల కోసం నానావస్థలు పడుతున్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కౌలురైతులుకు వెంటనే కౌలుకార్డులు జారీ చేసి బ్యాంకు రుణాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాత కోరుతున్నాడు. అదేవిధంగా ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ సాయం రూ.20 వేలు కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అప్పుడే ఖరీఫ్ సాగులో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

పెన్షన్ పెంపు చంద్రబాబు ఘనత

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సోమవారం ఆగిరిపల్లి దళితవాడలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల సొమ్మును ఆయన స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రంలో 183 అన్నా క్యాంటీన్‌లను ఆగస్టు 16న ప్రారంభించనున్నామని, రూ.5కే నాణ్యమైన భోజనం అందజేస్తామని తెలిపారు. రైతులను కలవరపాటుకు గురిచేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశామన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, టిడిపి మండల అధ్యక్షులు ఎం.కోటేశ్వరరావు, టౌన్‌పార్టీ అధ్యక్షులు పి.నరసింహారావు, జనసేన అధ్యక్షులు ఎం.మహేష్, ఎస్.నాగేశ్వరరావు, బిజెపి నేతలు రంగారావు, కె.బాబురావు, ఆయా పార్టీల నేతలు శివరామకృష్ణ, గోపాలరాజు, ఛాన్‌భాషా, శ్రావణ్, తహశీల్దార్ మృత్యుంజయరావు, ఎంపిడిఒ శామ్యూల్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పట్టణంలోని 26వ వార్డులో మంత్రి కొలుసు పార్థసారధి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పింఛన్ రూ.వెయ్యి పెంచడానికి ఐదు సంవత్సరాలు సమయం తీసుకుందని, టిడిపి ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి వెయ్యి పెంచడంతోపాటు ఏప్రిల్ నుంచి అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రి సెల్వి, టిడిపి పట్టణ అధ్యక్షులు జగదీష్, 26వ వార్డు కౌన్సిలర్, టిడిపి కార్యకర్తలు, పాల్గొన్నారు. అలాగే నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి, రావిచర్ల గ్రామాల్లో మంత్రి పెన్షన్లు పంపిణీ చేశారు. రావిచర్లలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.


నూజివీడులో పెన్షన్ అందిస్తున్న మంత్రి పార్థసారధి


పెన్షన్ సొమ్ము అందిస్తున్న ఎంఎల్‌ఎ చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి

2,68,353 మందికి పెన్షన్ సొమ్ము పంపిణీ : కలెక్టర్

ఏలూరు: జిల్లాలో 2,68,353 మందికి రూ.182.73 కోట్లు పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. సోమవారం నగరంలోని గన్‌బజార్ లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ (చంటి)తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు సామాజిక భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ చేస్తోందన్నారు. ఈ ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు తమ సామాజిక అవసరాలు, మందుల కొనుగోలు వంటి వాటికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ (చంటి) మాట్లాడుతూ ఎన్నికల హామీ అమలులో భాగంగా చంద్రబాబు పెన్షన్ పెంపు అమలు తక్షణమే ప్రారంభించడంతోపాటు గత మూడు నెలల పెంపు సొమ్ము కూడా చెల్లిస్తున్నారన్నారు. పేదవారికి వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయారాజు, స్థానిక టిడిపి, జనసేన నాయకులు మధ్యాహ్నపు బలరామ్, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల నాణ్యమైన పరిష్కారానికే ప్రాధాన్యత

'మీకోసం' అర్జీల పరిష్కారంపై అధికారులు వివరణివ్వాలి
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా 164 అర్జీలు స్వీకరణ
జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్


ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) అర్జీలు పరిష్కారంపై పూర్తిస్థాయిలో వివరణివ్వాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) జిల్లాస్థాయి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరావు పాల్గొన్నారు. ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం 164 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ వెట్రిసెల్వి వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ అర్జీలను క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో అర్జీలను పరిష్కరిస్తేనే అర్జీదారునికి మేలు జరుగుతుందన్నారు. అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, రీసర్వే, పోలీస్, భూవివాదాలు, విద్య, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఎపి సేవా సర్వీసుల్లో ఏమైనా పెండింగ్స్ ఉంటే వాటిని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు 4 నెలల గౌరవ వేతనం విడుదల

ప్రజాశక్తి - ఏలూరు

సర్పంచులకు ఏప్రిల్, మే, జూన్, జులై నెలల గౌరవ వేతనం ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. జిల్లాలో 544 గ్రామ పంచాయతీలకుగాను రూ.92.83 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు. సర్పంచుల ఖాతాలకు ఆ సొమ్ము జమ చేస్తామని చెప్పారు.



వినతి అందిస్తున్న నేతలు

నూతన నేర చట్టాలు పకడ్బందీగా అమలు

జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నూతన నేర చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. నగరంలో జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి స్వయంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి సుమారు 60 మంది తమ ఫిర్యాదులను ఎస్‌పికి అందజేశారు. వీటిపై స్పందించిన ఆమె వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతుల్లో ప్రజలను మోసగిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌పికి సమస్యలు వివరిస్తున్న ఫిర్యాదుదారులు

నాయకర్‌ను విప్‌గా నియమించాలని..

సిఎంకు పవన్ లేఖ

ప్రజాశక్తి - నరసాపురం


జనసేన నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు అధికార విప్‌గా ప్రకటించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. నాయకర్ బిసి సామాజిక తరగతికి చెందిన నాయకుడు. ఆయన 2019 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో 49 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.


ఎంఎల్‌ఎ నాయకర్

మధ్యాహ్న భోజన కార్మికురాలిని కొనసాగించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని జి.కొత్తపల్లి జెడ్‌పి హైస్కూల్లో మూడు సంవత్సరాలకుపైగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తున్న ఆకుల దేవిని అధికార పార్టీ నేతలు తొలగించేందుకు యత్నించడం దారుణమని, తక్షణం ఆ విధానం ఆపి ఆమెను యథాతథంగా కొనసాగించాలని సిఐటియు ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపిడిఒ, ఎంఇఒకు కూడా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం స్వచ్ఛందంగా మానేసిన పామర్తి వెంకటలక్ష్మి స్థానంలో ఆకుల దేవిని అడిగి మరీ తీసుకున్నారని, ఇప్పుడు అధికార పార్టీ నేతలు తమ వారిని నియమించడం కోసం ఆకుల దేవిని అన్యాయంగా తొలగించేందుకు ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో ఇదే తరహా చర్యలకు పాల్పడి ఆ ప్రభుత్వం ప్రజలకు దూరమైందని గుర్తించాలని సూచించారు. నేతల తీరు మారకుంటే తాము ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, బాధిత మహిళ ఆకుల దేవి, కార్మికులు పాల్గొన్నారు.



న్యాయవాదుల నిరసన

కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా..

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - భీమడోలు


కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ భీమడోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక న్యాయస్థానం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాళి నాగేశ్వరరావు, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి, భీమడోలు యూనిట్ అధ్యక్షులు పి.రాజారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను రద్దు చేసే వరకు విధుల బహిష్కరణ సాగుతుందని తెలిపారు.

ధర్మాజీగూడెం పిహెచ్‌సిని ఆధునికీకరిస్తా

చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పిస్తామని, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా బాధితులకు ఒఆర్‌ఎస్ ద్రావణాన్ని స్వయంగా తాగించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ త్వరలోనే జిల్లా వైద్యాధికారులతో మాట్లాడి ఈ పిహెచ్‌సి సేవలను విస్తరిస్తామన్నారు. పార్కింగ్ సౌకర్యం, మందుల నిల్వల కోసం స్టోర్ రూమ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్

కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గణపవరం

సరిపల్లి సిపిఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని ఉద్యోగ, కార్మికులు సోమవారం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు

4, 5 తేదీల్లో నిర్వాసిత గ్రామాల్లో వ్యకాస, రైతు నేతల పర్యటన

ఏలూరు అర్బన్: ఈ నెల 4, 5 తేదీల్లో పోలవరం నిర్వాసితుల సమస్యలపై రైతు, వ్యవసాయకార్మిక సంఘాల రాష్ట్ర నాయకత్వం పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించనుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. సోమవారం స్థానిక అన్నేభవనంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 4న వేలేరుపాడు మండలం రేపాకగొమ్మి, కుక్కునూరు మండలం కివ్వాక, చీరవల్లి మాధవరం, 5న జీలుగుమిల్లి మండలంలోని నిర్వాసిత కాలనీలు, జంగారెడ్డిగూడెం మండలంలోని చల్లావారిగూడెం నిర్వాసిత కాలనీల్లో బృందం పర్యటిస్తుందని తెలిపారు. బృందంలో ఎపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.నాగరాణి, ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణతోపాటు జిల్లా నాయకులు పాల్గొంటారని వివరించారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అల్లూరి త్యాగాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు 127వ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ నెల 4న అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని ఏలూరులో 127 సంఘాలు చేపట్టిన వారోత్సవ కార్యక్రమంలో భాగంగా కస్తూరిబాయ్ గర్ల్స్ హైస్కూల్, బోయ్స్ కాన్వెంట్, శర్వాణి స్కూల్, శాంతినగర్ చైతన్య స్కూళ్లలో సమావేశాలు నిర్వహించారు. కస్తూరిబాయ్ గర్ల్స్ హైస్కూల్లో ప్రేయర్ సందర్భంగా జరిగిన సభకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని రజిత అధ్యక్షత వహించారు. దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం మరణించిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో సమాజాన్ని, ప్రజల బాధలను పరిశీలించాలని కోరారు. ఈ సభల్లో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో స్కూళ్లు, కాలేజీలు, వాకర్స్ గ్రౌండ్లు, స్టడీ సెంటర్లలో శుక్రవారం నుండి నాలుగో తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జీవితంపై డ్రాయింగ్, ఏకపాత్రాభినయం, వేషధారణ, ఉపన్యాసం పోటీలు ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాలుగో తేదీ సాయంత్రం కోటదిబ్బలోని సీతారాంభర్తీయా కళ్యాణమండపంలో పెద్దఎత్తున సభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సురేష్ బహుగుణ పోలీస్ స్కూల్, సిఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మదన్, రాజశేఖర్, శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడిపాటి నర్సింహారావు

నాన్ ఎసి స్టార్ లైనర్ స్లీపర్ కోచ్ బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆర్‌టిసి ఏలూరు డిపో నుంచి ప్రజల సౌకర్యార్థం రెండు నాన్ ఎసి స్టార్ లైనర్ స్లీపర్ కోచ్ బస్సులను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్. వరప్రసాద్ మాట్లాడుతూ ఈ బస్సులు ప్రతిరోజు రాత్రి 10.30 గంటలకు ఏలూరు నుంచి బయలుదేరి బిహెచ్ఇఎల్ చేరుకుంటాయని, తిరిగి బిహెచ్ఇఎల్ నుంచి రాత్రి 9.30 గంటలకు బయలుదేరి ఏలూరు చేరుకుంటాయని, టిక్కెట్ ధర రూ.980 అని తెలిపారు.

'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'కు 5 అర్జీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయని ఆర్‌డిఒ భవానీశంకరి తెలిపారు. పట్టణానికి చెందిన నలుగురు, ముసునూరుకు చెందిన ఒకరు అర్జీలను అందించినట్లు చెప్పారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. నూజివీడు తహశీల్దార్ కార్యాలయంలో ఎటువంటి అర్జీలు రాలేదని తహశీల్దార్ ఎ.విశ్వనాథ్‌శాస్త్రి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఒకటో పట్టణంలోని వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణం నిమిత్తం మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, ఏడు కాలవల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా ఆలయం సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ ఆలయం ఏరియా, ఫిల్ హౌస్ పేట, మాదేపల్లి రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నారాయణపురం విద్యార్థుల ప్రతిభ

ఉంగుటూరు : నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎపి పీజీ సెట్-2024లో మంచి ర్యాంకులు సంపాదించారని కళాశాల ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వ రరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చక్కగా కష్టపడి చదువుకుని మంచి మార్కులు సంపాదించాలని కోరారు. ఎంఎ పొలిటికల్ సైన్స్‌లో టేకి వెంకట రాజ్యలక్ష్మి 154వ ర్యాంకు, ఎంఎస్‌సి ఫిజికల్ సైన్స్‌లో కోరాడ వనజ 325 ర్యాంకు, గంటా ఋషి ఎంకామ్‌లో 342వ ర్యాంకు, ఎపి ఐ సెట్‌లో టేకిపొల్ శైలేష్, రాపాక దుర్గామహేష్ ర్యాంకులు సాధిం చారని, కళాశాలలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎపి ఎడ్ సెట్, లా సెట్‌లో కూడా రాణించడం అభినందనీయమన్నారు. కళాశాలలో చదువు కున్న విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడం శుభ సూచికమని అకాడమిక్ కో-ఆర్డి నేటర్ డాక్టర్ కొండా రవి తెలిపారు. విద్యార్థులను అధ్యాపక సిబ్బంది అభినందించారు.

గ్యాస్ కనెక్షన్ల ఇ కెవైసి గ్రామంలోనే చేయాలి

ప్రజాశక్తి - చాట్రాయి

గ్యాస్ కనెక్షన్ల ఇ కెవైసి పంచాయతీ పరిధిలోనే చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం కోరారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఇండియన్ గ్యాస్ కనెక్షన్లు ఎనిమిది వేల వరకు ఉన్నాయని, ఇ కెవైసి నమోదు చేసుకోవటానికి 18 గ్రామ పంచాయతీల నుంచి మహిళలు రావాలంటే బస్సు సౌకర్యం, ఆటో సౌకర్యం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాట్రాయిలో ఇండియన్ గ్యాస్ కంపెనీ వద్ద కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రతి పంచాయతీ పరిధిలో ఇ కెవైసి నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ గ్యాస్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

బడేటి చంటికి కాపు సంక్షేమ సేవా సంఘం సత్కారం

ఏలూరు సిటీ : ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని కాపు సంక్షేమ సేవా సంఘం వారు సోమవారం ఘనంగా సత్కరించారు. మణికంఠ గ్రూపు సంస్థల అధినేత గునిశెట్టి రాజేష్ జ్ఞాపికతో పాటు విద్యార్థులకు అందించేందుకు పుస్తకాలు, పెన్నులు ఇచ్చారు. సభకు అధ్యక్షత వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీరాములు వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిపల్లి ప్రసాద్, ఎంఆర్‌డి బలరామ్, మామిళ్లపల్లి పార్థసారధి, నారాశేషు, కంచన రామకృష్ణ పాల్గొన్నారు.

భీమడోలు హైస్కూలులో 'టీచ్ టూల్'

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధ్యాయుల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు విద్యాశాఖ అమలు చేస్తున్న టీచ్ టూల్ కార్యక్రమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎకాడమిక్ పర్యవేక్షణ అధికారి ఆర్.రామారావు, నోడల్ అధికారి శ్రీహరి కోరారు. భీమడోలు హైస్కూల్ కేంద్రంగా సమగ్ర శిక్ష, విద్యా పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు కొనసాగే టీచ్ టూల్ కార్యక్రమాన్ని వారు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహ్మద్ పాల్గొన్నారు.

మంగపేటలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

కొయ్యలగూడెం : ఐసిడిఎస్ ప్రాజెక్టు కొయ్యలగూడెం పరిధిలో మంగపేట గ్రామంలో మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం కొయ్యలగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ నయోమీ రాణి ఆధ్వర్యంలో బడికి పోదాం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ స్వర్ణకుమారి, ఐటిసి జిల్లా కోఆర్డినేటర్ ఎన్.కృష్ణ హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటల ద్వారా అందించే విద్య గురించి తల్లులకు వివరించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు టౌన్ : 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఆరేళ్ల సమీకృత బిటెక్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనలో భాగంగా సోమవారం క్యాప్ విభాగంలో 48 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం హాజరయ్యారు. మంగళవారం క్యాప్, భారత్ స్కౌట్స్, గౌడ్స్ (బిఎస్‌జి) కేటగిరీల్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరగనున్నట్లు ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్, ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కొరగుంటపాలెంలో చోరీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కొర్రగుంటపాలెంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వెంట్రపాటి లవకుశరావు 15 రోజుల క్రితం తన ఇంటికి తాళాలు వేసి భార్యాభర్తలిద్దరూ హైదరాబాదులో ఉంటున్న తన కుమారుడి ఇంటికి వెళ్లారు. లవకుశరావు ఇంటి పక్కన నివాసం ఉంటున్న కమ్మెల శ్రీనివాసరావు హైదరాబాదులో ఉన్న లవకుశరావుకు ఆదివారం ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని, దొంగలు పడినట్లు ఉందని చెప్పాడు. దీంతో లవకుశరావు హైదరాబాదు నుంచి సోమవారం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని రెండు బీరువాల్లో ఉన్న కేజీన్నర వెండి వస్తువులను అపహరించుకుపోయినట్లు గుర్తించాడు. దీంతో జరిగిన ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పలు ఆలయాల్లో చోరీ


ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు రూరల్ ప్రాంతంలో ఆలయాల హుండీల్లో నగదును దుండగుడు అపహరించుకుపోయారు. రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రోడ్డు ప్రాంతంలోని ఆరో డివిజన్ సుంకరవారితోటలో కనకదుర్గమ్మ ఆలయం, మాదేపల్లిలో వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో హుండీలను గుర్తుతెలీని దుండగుడు పగలగొట్టి అందులోని నగదును అపహరించుకుపోయారు. రూరల్ పోలీసులకు ఆలయ పెద్దలు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ రాజారెడ్డి ఘటనా స్థలాలకు వెళ్లి వివరాలు సేకరించారు. అక్కడ ఉన్న వీడియో సిసి పుటేజీల వీడియో ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు ఈ నాలుగు దేవాలయాల్లో ఒక్కడే చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు.

ఘనంగా ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ


జిల్లావ్యాప్తంగా ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. టిడిపి, జనసేన ఎంఎల్ఎలు, కూటమి నాయకులు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, అధికారులతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెంచిన పెన్షన్‌తో రూ.నాలుగు వేలతో పాటు గత మూడు నెలల్లో రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.ఏడు వేలు సొమ్ము అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక వన్‌టౌన్ పరిధిలోని 11, 12వ డివిజన్‌లో, టూ టౌన్ పరిధిలోని 35, 39, 42వ డివిజన్లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఉదయం 5:30 గంటలకు అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎంఎల్ఎ బడేటి చంటి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బడేటి చంటి, రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ల మొత్తాన్ని రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచి అందిస్తున్నా మన్నారు. పెంచిన పెన్షన్‌తో పాటు గత మూడు నెలలకు రూ.వెయ్యి చొప్పున రూ.మూడు వేలు మొత్తం రూ.ఏడు వేల పెన్షన్ అందించడం టిడిపి కూటమి చిత్తశుద్ధికి నిదర్శన మన్నారు.


చింతలపూడిలో...

ఏలూరు టౌన్ : దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం కొత్తూరు లో ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన దెందులూరు నియోజవకర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన నేత కొటారు ఆదిశేషు పాల్గొన్నారు. శ్రీరామవరం గ్రామంలో తెలుగు యువత దెందులూరు నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపిపి మోతుకూరి నాని బాబు ఆధ్వర్యంలో కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహానికి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికే వెళ్లి నానిబాబుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.


కామవరపుకోటలో...

చింతలపూడి : అమూల్యమైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో తాను పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని సుప్రీంపేట, బట్టువారిగూడెం, ఎన్‌విఎన్.కాలనీ, వెలగలపల్లిలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, అధికారులతో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆంథోనీనగర్ వద్ద ఆర్‌టిసి బస్సు అర్ధాంతరంగా ఆగిపోవడంతో పెన్షన్లు తీసుకోవడానికి పొరుగూరు నుంచి వెళ్తూ రోడ్డుపై నిలబడిన ప్రయాణికులను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పలకరించారు. త్వరితగతిన వారు గమ్యం చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎ స్పందన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉంగుటూరు: నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నాలుగు గ్రామాల్లో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పెన్షన్లు పంపిణీ చేశారు. సచివాలయం, ఇతర శాఖల ఉద్యోగులు ఇంటింటా పెన్షన్లు అందించారు. నారాయణపురం

రూ.7 వేలు అందుకున్న లబ్ధిదారుల్లో ఆనందం

తదితర గ్రామాల్లో టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పార్టీ కార్యకర్తలతో కలిసి పింఛన్లు అందించారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పెన్షన్లు పంపిణీ చేశారు. పొలసానిపల్లి గ్రామపంచాయతీకి వచ్చిన ఎంఎల్ఎ ధర్మరాజుకు, టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆధ్వర్యంలో ప్రజలు స్వాగతం పలికారు.

నిడమర్రు : మండలంలోని చిననిండ్రకొలను గ్రామంలో ఉదయం ఆరు గంటలకి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. తోకలపల్లి, మందలపర్రు, భువనపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు వారి ఇంటికి నేరుగా వెళ్లి పెంచిన పెన్షన్ సొమ్మును అందించారు. లబ్ధిదారులతో కలిసి చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ద్వారకాతిరుమల రూరల్ : మండలంలోని తిమ్మాపురం పంచాయతీలో గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పెన్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం సచివాలయం విఆర్ఒ మహాలక్ష్మి ఉదయం 5:30 గంటలకే ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించారు. పలు గ్రామాల్లో పెన్షన్‌తో పాటు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా మొత్తం 4,318 మంది లబ్ధిదారుల్లో 3,219 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కెఎం.మంగతాయారు తెలిపారు. దర్భగూడెం, జీలుగుమిల్లి, తాటియకులగూడెం పంచాయతీల్లో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చేతులమీదుగా పలువురికి పెన్షన్లు పంపిణీ చేశారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో ఏలూరు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి సచివాలయ సిబ్బంది, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.


జంగారెడ్డిగూడెం టౌన్ : స్థానిక 18వ వార్డులో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం ఆరు గంటలకు డిసిసిబి మాజీ ఛైర్మన్, జనసేన నాయకుడు కరాటం రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేంద్ర కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, 17వ వార్డు కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, పార్టీ నాయకులు కర్రా భాస్కర్, తూటికుంట రాము, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి పాల్గొన్నారు. ఒకటో సచివాలయం పరిధిలో మూడు వార్డులకు టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ముసునూరు : ముసునూరు గ్రామంలో సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు సచివాలయ సిబ్బందితో కలిసి అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు దేవినేని ధలరామ్ మాట్లాడారు. వలసపల్లిలో మెదరమెట్ల సురేంద్ర, కాటన్‌పాడులో సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, గద్దల సుహాసిని మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, మండలంలోని 16 గ్రామాల్లో అధికారులతో కలిసి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెన్షన్లు పంపిణీ చేశారు .

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభించారు.


టి.నరసాపురం : మండలంలోని వీరభద్రవరంలో మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు, తిరుమల దేవిపేటలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు తోట లక్ష్మీనారాయణ, రాజుపోతేపల్లిలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నెల్లూరు వెంకట చలపతిరావుల చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు.

ముదినేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందించారు. ముదినేపల్లిలో గ్రామ


ఏలూరు టౌన్ : దెందులూరులో పింఛన్ల పంపిణీ


సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు, మండలాధ్యక్షులు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కామవరపుకోట : మండలంలో ఉదయం ఆరు గంటల నుంచి పెన్షన్లు పంపిణీ చేశారు. సచివాలయల సిబ్బందితో పాటు టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళీ రామకృష్ణ, టిడిపి మండల ప్రెసిడెంట్ కిలరి సత్యనారాయణ, కోనేరు సుబ్బారావు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, సుధీర్ బాబు, జనసేన నాయకులు బొబ్బిలి వీరబాబు, సిరిగినేటి వెంకన్న బాబు పాల్గొన్నారు.


ఉంగుటూరులో...

కలిదిండి: మండల కేంద్రంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు. టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, మాజీ జెడ్‌పిటిసి నున్నా రమాదేవి, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, మాజీ ఎంపిటిసి లంకా రత్నారావు, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, ఎంపిడిఒ దినతేజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండవల్లి : భైరవపట్నంలో కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. గ్రామ ప్రముఖులు చాపరాల దుర్గాప్రసాద్ మాట్లాడారు. అనంతరం పాఠశాలలో నోటు పుస్తకాలను, పెన్నులను, ఇతర సామగ్రిని అందించారు. ఈ


ద్వారకాతిరుమల రూరల్‌లో...

కార్యక్రమంలో సజ్జ సురేష్‌బాబు (బాబి), గంధమనేని నాని, గుంటూరు సత్యనారాయణ, నాగదాస స్వామి దాసు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ ఎంపిడిఒ జి.శ్రీనుతో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులకు పెన్షన్లు అందించారు.

విరాళంగా పెన్షన్ సొమ్ము అందజేత

చింతలపూడి : వెలగలపల్లిలో వృద్ధుడు నారాయణరెడ్డికి రూ.ఏడు వేల పెన్షన్ ఇవ్వగా ఆయన ఈ పెన్షన్ మొత్తానికి మరో రూ.116 కలిపి మొత్తం రూ.7,116 అమరావతి నిర్మాణానికి విరాళంగా ఎంఎల్ఎకు అందించారు.

కామవరపుకోట : పింఛన్ సొమ్ము అందుకున్న తడికలపూడి గ్రామానికి చెందిన సూర్యదేవర పద్మావతి ఆ రూ.ఏడు వేలకు మరో రూ.మూడు వేలు కలిపి మొత్తం రూ.పది వేలు రాష్ట్రాభివృద్ధికి అందించింది.

వైద్య వృత్తిలో ఉన్నవారందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైద్యులే ప్రజలకు దేవుళ్లని, అలాంటి వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆశాలు, ఇతర వైద్య రంగంలో సేవలు అందిస్తున్న వారందరికీ సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈరోజు ప్రజల నుంచి దూరమై అతిపెద్ద కార్పొరేట్ వ్యాపారంగా వైద్య వృత్తి మారిందని, ఈ స్థితిలో అనేకమంది డాక్టర్లు తమకు చేతనైనంత సేవ ప్రజలకు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రుల్లో చాలీచాలని వేతనాలతో తమ వృత్తే దైవంగా భావించి రోగులకు సేవలందిస్తున్నవారు అనేక మంది ఉన్నారని కొనియాడారు. నార్మన్ బెతూన్, కొట్నీస్లు అత్యంత కష్టకాలంలో, యుద్ధ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించారన్నారు. అనేక మంది ప్రజలకు వైద్యం చేరువ కావడానికి విశేష సేవలందించినవారున్నారన్నారు. కరోనా వంటి భీతావాహ సమయాల్లో ధైర్యంగా వైద్య సేవలందించిన వారిని మరోసారి ఈ సందర్భంగా ఆయన అభినందించారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులందరికీ సిపిఎం తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, పెరిగిపోతున్న మందుల ధరలను అరికట్టాలని, వాటిపై జిఎస్‌టి భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

వైద్యుల సేవలు అభినందనీయం

ఏలూరు టౌన్ : సమాజ శ్రేయస్సు కోసం నిస్వార్థంతో పని చేస్తున్న వైద్యుల సేవలు అభినందనీయమని డిపిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం పెదపాడు పిహెచ్‌సిలో పని చేస్తున్న వైద్యులు సిహెచ్.చక్రధర్, కె.అనంతపాల్‌లను డిపిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం తరపున సన్మానించారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల పిఎంపి అసోసియేషన్ తరపున ద్వారకాతిరుమల పిహెచ్‌సి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ కన్వీనర్ ములకాల పానకాలు, పిఎంపిలు మస్తాన్ వలి, సమీర్, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయేరియాపై పూర్తి అవగాహన అవసరం

'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'లో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పల్లెల్లో, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అమలు జరిగేలా, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గోదావరి సమావేశ మందిరం ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ఒఆర్ఎస్ జింక్ కార్నర్ స్టాల్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్‌డిసి కార్యక్రమాల వివరాలను డిపిఒ టి.శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా వైద్యశాఖాధికారి ఎస్.శర్మిష్టని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెరుగైన పారిశుధ్యం చేపట్టి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం మహిళలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ పాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ డి.పుష్పమణి, డిఎంహెచ్ఒ శర్మిష్ట, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాద్, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : నగరంలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా చూడాలని ఎంఎల్ఎ బడేటి చంటి, నగర పాలక సంస్థ మేయర్ నూర్జహాన్ పెదబాబులు మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, ఇతర అధికారులకు ఆదేశించారు. (స్టాప్ డయేరియా) అతిసారా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా స్థానిక 15వ డివిజన్ ఆముదాల అప్పలస్వామి కాలనీలో డయేరియా వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ శానిటేషన్, తాగునీటి సరఫరాల్లో జాగ్రత్తలు తీసుకొని ఏలూరు నగరంలో ఒక్క డయేరియా కేసు కూడా రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఎంహెచ్ఒ డాక్టర్ మాలతి, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు, బలరాం, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలువురు సిఒలు, ఆర్‌పిలు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగినప్పుడే పలు రకాల వ్యాధులను దూరం చేయవచ్చని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని, స్వచ్ఛమైన తాగు నీరందించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

ఉంగుటూరు : వర్షాకాలంలో డయేరియా రాకుండా పిహెచ్‌సిలకు సరిపడా ఔషధాలు పంపిణీ చేశామని ఎంఎల్ఎ ధర్మరాజు తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు పిహెచ్‌సిలో ప్రత్యేక ఔషధాల శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఎంఎల్ఎగా తొలిసారిగా ఆసుపత్రిని సందర్శించిన ధర్మరాజుకు పిహెచ్‌సి వైద్యులు కె.సుబ్బరాజువర్మ, శ్రావణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సత్కరించారు.

చాట్రాయి : డయేరియాపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి అదుపు చేయటంలో వైద్య సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని ఎంపిడిఒ మంగకుమారి అన్నారు. పిహెచ్‌సిలో స్టాప్ డయేరియా అనే నినాదంతో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వైద్యులు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.జ్యోతి అవగాహన కల్పించారు.

ముసునూరు : ముసునూరు పిహెచ్‌సిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కొండేటి విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షకీనా ఇవాంజిలిన్, రత్నకుమారి, మురళీ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ చిన్నారులకు, మహిళలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ సాచెట్లు పంపిణీ చేశారు. డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఎంపిటిసి నీలి సుమన్ సూచించారు.

భీమడోలు : డయేరియాను నిరోధించడానికి, మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ స్వర్ణలత కోరారు. మండల పరిధిలో రెండు నెలల పాటు కొనసాగే స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా ఎంపిడిఒ పంచాయతీ విస్తరణ అధికారి సుందరి సహకారంతో గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ, తమ పరిధిలో కార్యక్రమాన్ని ప్రారంభించి ర్యాలీలు నిర్వహించారు.

4 నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు అర్బన్ : హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ), హేలాపురి కళాపరిషత్ ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6, 7 తేదీల్లో ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో అల్లూరి సీతారా మరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎంహెచ్ఎ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులు పాటు నిర్వహించే ఈ నాటిక పోటీల్లో తెలుగు ఉభయ రాష్ట్రాల నుంచి ఘన చరిత్ర కలిగిన నాటక కళా సమాజా లచే ఏడు నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఎస్‌విసి మాల్‌లో తంకోస్ నేచురల్స్ ప్రారంభం

ఏలూరు సిటీ : ఏలూరు నగరంలో కొత్త బస్టాండ్ ఎదురుగా ఎస్‌విసి మాల్‌లో సోమవారం ఉదయం తంకోస్ నేచురల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యాజమాన్యం కె.దుర్గారావు, మహేష్ మాట్లాడుతూ ఈ షాపులో అందరికీ అనువైన ఐస్ క్రీమ్స్ ఉంటాయని, చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఏం కావాలో అన్ని రకాల ఐస్ క్రీములు లభ్యమవుతాయని తెలిపారు. నగరంలో ఇటువంటి షాపు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని కొండపాటి సత్యవతి తెలిపారు.